# బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలి

- ప్రజల మధ్య ఉండే నాయకుడినే ఎన్నుకోవాలి
- కారెక్కిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు
- సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- ఏపీలోని జగద్గురు కందర్లింగ దర్గాలో పూజలు




జగద్గురు కదర్లింగ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, నవంబర్ 13 : కార్యకర్తలు బీఆర్ఎస్‌కు అండగా నిలబడి పార్టీ గెలుపుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో గట్టు మండలం రాయపురం గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు కర్రెప్ప, పాగుంటన్న, నర్సప్ప, ప్రేమరాజ్, శ్రీకాంత్, తిరుపతి, నరసింహులు, వీరేశ్, తిమ్మప్ప, భీమయ్య, రాజుతోపాటు 50మంది బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మల్దకల్ మండలం మద్దెలబండ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ వీరన్న, చంద్రన్న, బండి నారాయణ, లక్ష్మన్న, బాబు, బుడ్డన్నతోపాటు 30మంది పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే తనయుడు సాయిసాకేత్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 30న జరిగే ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా బీఆర్ఎస్‌కు మద్దతు తెలపాలని కోరారు. ప్రజల మధ్య ఉండే నాయకుడిని ఎన్నుకుంటారో.. చుట్టపు చూపుగా వచ్చే నాయకులను ఎన్నుకుంటారో ఆలోచించుకోవాలన్నారు. బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థికి మద్దతు తెలిపితే గద్వాల నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు హనుమంతు, ప్రవీణ్, వైస్ఎంపీపీ వీరన్న, నాయకులు నారాయణ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

**జగద్గురు కదర్లింగ దర్గా సన్నిధిలో..**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆదోని నియోజకవర్గం కౌతాలం గ్రామంలో ఉన్న జగద్గురు కదర్లింగ దర్గాను ఎమ్మెల్యే దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం గురువు ఆశీస్సులు పొందారు. గుల్బర్గాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మైనార్టీ మత పెద్దలను దర్గా వద్ద కలిసి సన్మానించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు రామకృష్ణారెడ్డి, అలీ, బజారి, ఫయాజ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు తదితరులున్నారు.



ఎమ్మెల్యే తనయుడు సాకేత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు



ఎంసీఎంసీ విభాగాన్ని పరిశీలిస్తున్న వసంత్‌కుమార్, చిత్రంలో కలెక్టర్ క్రాంతి

# సమర్థవంతంగా పనిచేయాలి

- జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు వసంత్‌కుమార్
- జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల్లో పటిష్ట నిఘా ఉంచాం
- రెండు నియోజకవర్గాలకు ఈవీఎంలు తరలించాం: కలెక్టర్ క్రాంతి

గద్వాల, నవంబర్ 13 : సాధారణ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీంలు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అధికారులను సాధారణ ఎన్నికల పరిశీలకులు వసంత్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల సంఘం జిల్లాకు నియమించిన సాధారణ పరిశీలకుడు సోమవారం ఐడీవోసీ కార్యాలయానికి చేరుకోగా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పరిశీలకులు సీ-విజిల్, కంట్రోల్ రూం, ఎంసీఎంసీ, మీడియా సెంటర్‌ను పరిశీలించారు. జిల్లాలో జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లను పరిశీలకుడికి కలెక్టర్ వివరించారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. గ్రీవెన్స్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 58, టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా 796 కాల్స్ రిసీవ్ చేసుకొని వాటిని పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి నియోజకవర్గాల వారీగా పంపించామన్నారు. అలంపూర్, గద్వాల నియోజకవర్గాల పరిధిలో ఎస్ఎస్‌టీఎఫ్ ఎస్టీ, వీఎస్టీ బృందాలను ఏర్పాటు చేసి 24గంటలు పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఐదు చెక్‌పోస్టుల ద్వారా నిఘా ఉంచామని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశామని ఎన్నికల పరిశీలకుడికి కలెక్టర్ తెలిపారు. అక్రమంగా తరలించే మద్యం, నగదుపై దృష్టి సారించామన్నారు. ఎంసీఎంసీ మానిటరింగ్ కమిటీ కార్యాలయాన్ని తనిఖీ చేసి స్క్రూట్నీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం వసంత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రభావితం చేసే అంశాలు ప్రజలు, పార్టీ నాయకుల దృష్టికి వస్తే 6300332716 నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదు కోసం తనను జెన్కో అతిథి గృహం (జూరాల)లో నేరుగా సంప్రదించవచ్చన్నారు. అలంపూర్ నియోజకవర్గానికి సంబంధించిన వారు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, గద్వాల నియోజకవర్గం వారు సాయంత్రం నాలుగు నుంచి ఆరుగంటల వరకు తనను సంప్రదించవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో అధికారులు భద్రప్ప, ప్రియాంక, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మాట అబద్ధాల మూట

- మూడేండ్లలో ఆర్డీఎస్, నెట్టెంపాడ్ పూర్తిచేస్తాం..
- వాల్మీకుల ఎస్టీ బిల్లు ఆపింది కేంద్ర ప్రభుత్వమే
- హస్తం పార్టీ అధికారంలోకొస్తే రాష్ట్రం పరిస్థితి కుక్కలు చింపిన విస్తరే!
- సకల జనులకు సంక్షేమాన్ని పంచుతున్న సర్కారు
- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- మీ బిడ్డలా ఆదరించి గెలిపించండి
- అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు



ధర్మవరంలో ప్రచార రథంపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 13 : కాంగ్రెసోళ్ల మాట అబద్ధాల మూట అని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం పరిస్థితి కుక్కలు చింపిన విస్తరేనని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి హెచ్చరించారు. విజయుడు పేదబిడ్డ.. అతడిని మీ బిడ్డగా ఆదరించాలని కోరారు. సోమవారం ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం, గార్లపాడు, కారుపాకుల, దువాసిపల్లి, సాసనూలు, పుటాన్‌దొడ్డి, వేముల గ్రామాల్లో ఎమ్మెల్సీ చల్లా, అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ విజయుడు నిరు పేదకుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అని, నియోజకవర్గంలోని పేదల సమస్యలు అర్థం చేసుకోగలడన్నారు. అతడిని అందరూ ఆదరించాలని కోరారు. అదేవిధంగా రైతుబంధు, బీమా, 24గంటల కరెంట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, బీసీబంధు, చేపపిల్లల పంపిణీ, గొర్రెల యూనిట్ల పంపిణీ, గీత కార్మికులు, ఆసరా పింఛన్లతోపాటు ఎన్నో సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేస్తూ సకలజనుల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం బంగారు బాటలు వేసిందన్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మూడేండ్లలో ఆర్డీఎస్, నెట్టెంపాడ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. మన ప్రాంతం బాగుండాలని కోరుకుంటే మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని, విజయుడిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అంతకుముందు ధర్మవరంలో ప్రచారంలో భాగంగా ముగ్గురు వృద్ధురాళ్లను చల్లా పలకరించారు. పింఛన్ వస్తుందా అని అడగ్గా.. వస్తుంది బిడ్డా.. ఈపారి కూడా కేసీఆర్ పక్కా అని అనడంతో ఆ ప్రాంతమంతా చప్పట్లు, ఈలలు, నినాదాలతో మారుమోగింది. మీ బిడ్డగా ఆదరించి కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాని ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు ప్రజలను కోరారు. చల్లా నేతృత్వంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హనుమంత్‌రెడ్డి, రంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవిరెడ్డి, నారాయణనాయుడు, నర్సింహులు, శంకర్‌నాయుడు, వీరబాబు, నాగన్‌గేడ్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్మవరంలో వృద్ధులతో ఎమ్మెల్సీ చల్లా మాటామంతి..

**ఇటిక్యాలలో ఇంటింటి ప్రచారం**

ఇటిక్యాల, నవంబర్ 13 : మండలంలోని మునగాల, మొగలిరావుల చెరువు, పెద్దదిన్నె, గోపల్‌దిన్నె గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మండలంలోని బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు.

# సజావుగా స్క్రూట్నీ

- గద్వాల రిటర్నింగ్ అధికారి అపూర్వ చౌహాన్




రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఆర్వో

గద్వాల, నవంబర్ 13 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గద్వాల నియోజకవర్గంలో మొత్తం 25మంది అభ్యర్థులు 32 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కాగా సోమవారం నిర్వహించిన స్క్రూట్నీలో ఐదు దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ తెలిపారు. ఐడీవోసీలోని సమావేశ మందిరంలో గద్వాల అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యే అభ్యర్థులుగా దరఖాస్తు చేసుకున్న వివిధ రాజకీయపార్టీల నాయకులతో అదనపు కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నానినేషన్ల తిరస్కరణ, నామినేషన్ల తిరస్కరణకు గల కారణాలను రాజకీయ పార్టీల నాయకులకు వివరించారు. బహుజన సమాజ్‌వాది పార్టీ నుంచి పరుమాల కృష్ణ దరఖాస్తు చేసుకోగా ప్రపోజల్స్ సరిగా లేక పోవడం, ఏ,బీ ఫాంలో ఒకరే ప్రపోజల్స్ చేయడం, డిపాజిట్ సబ్మిట్ చేయక పోవడం వంటి కారణాలతో తిరస్కరించారు. బీఆర్ఎస్ తరపున బండ్ల జ్యోతి నామినేషన్ వేయగా బీఆర్ఎస్ నుంచి ప్రధాన అభ్యర్థి నామినేషన్ అంగీకరించగా ప్రపోజల్స్ సరిగా లేకపోవడం వల్ల తిరస్కరించారు. కాంగ్రెస్ నుంచి చిన్న తిరుపతయ్య దరఖాస్తు చేసుకోగా ప్రధాన అభ్యర్థి సరిత ఉండడం, డిపాజిట్ చేయకపోవడం, ప్రపోజల్స్ సరిగా లేకపోవడం వల్ల తిరస్కరించారు. బహుజన సమాజ్ పార్టీ నుంచి సురేంద్రబాబు నామినేషన్ దాఖలు చేయగా సరైన ప్రపోజల్స్ చేయకపోవడం, డిపాజిట్ సబ్మిట్ చేయకపోవడం, దరఖాస్తు ఏ, బీఫాంలలో ఇద్దరు ప్రపోజల్స్ సరిగా లేకపోవడంతో తిరస్కరించారు. బహుజన రిపబ్లికన్ సోషలిస్ట్ పార్టీ నుంచి హనుమంతు దరఖాస్తు చేసుకోగా ఇన్‌సఫీషియంట్ నంబర్స్ ప్రపోజల్స్ చేయడం వల్ల నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.

**అలంపూర్‌లో ఏడు..**

అలంపూర్, నవంబర్ 13 : అలంపూర్ నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన నామినేషన్ పరిశీలనలో ఏడు నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు రిటర్నింగ్ అధికారిణి చంద్రకళ తెలిపారు. మొత్తం 25మంది నామినేషన్లు దాఖలు చేయగా 18మందివి అమొదం పొందగా ఏడుగురివి తిరస్కరణ గురయ్యాయన్నారు. అందులో మాకుల కేశవరావు (బీఎస్పీ), కుర్వ మల్లయ్య (బీజేపీ), రాజన్న(బీఆర్ఎస్), ఆర్వీ శేషు(ఇండిపెండెంట్ ), మాదన్న(బీజేపీ), ఆంజనేయులు(ఇండిపెండెంట్), ఎన్ సంపత్‌కుమార్(ఇండిపెండెంట్) ఉన్నాయన్నారు.